క్లుప్తంగా

5వ సెమిస్టర్ ఫలితాలు

దొనకొండ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 5వ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక గౌతమీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. వారిలో బీకాం కంప్యూటర్స్ విభాగం నుంచి పోటు పాలంక వీరయ్య 552/700, మోడి పూజిత 550/700, ఉస్తేల పెద్దక్క 537/700 సాధించారు. బీఏ విభాగంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ఎం.బాలకాశయ్య 482/600, వి.ప్రవల్లిక 467/600, టి.ప్రియాంక 459/600 సాధించారని కళాశాల అడ్మిన్ నాని తెలిపారు. ఈ సందర్భంగా వారిని కళాశాల చైర్మన్ కె.గుండారెడ్డి, ప్రిన్సిపాల్ గోపి, వైస్ ప్రిన్సిపాల్ రామయోగి, సిబ్బంది అభినందించారు.

పోస్టాఫీసులో నిలిచిన ఆన్‌లైన్ సేవలు

దొనకొండ: స్థానిక పోస్టాఫీసులో ఐదు రోజుల నుంచి బీఎస్ఎన్ఎల్ ఇంటర్‌నెట్ ఆన్‌లైన్ సేవలు ఆగిపోయాయి. వివిధ పనుల కోసం గ్రామాల నుంచి పోస్టాఫీసుకు వచ్చిన వినియోగదారులకు కంప్యూటర్‌లు పని చేయక పోవటంతో వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. పోస్టాఫీసులో పోస్టల్, పార్శిల్ బుకింగ్, రిజిస్టర్ పోస్ట్, ఆర్‌డీ చెల్లింపులు, ఆధార్, ఇన్సూరెన్స్ తదితర సేవలు వినియోగదారులకు అందిస్తుంటారు. 5 రోజుల నుంచి ఆ సేవలకు సెలవు. బీఎస్ఎన్ఎల్ అధికారులు పట్టించుకోక పోవడంతో పోస్టల్ ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. పోస్టల్ వారిపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి ఆన్‌లైన్ సేవలు వెంటనే జరిగేలా చర్యలు చేపట్టాలని గ్రామాల్లోని ఖాతాదారులు కోరుతున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

- సీనియర్ సివిల్ జడ్జి శివశంకరరెడ్డి

దర్శి: కేసుల పరిష్కారానికి రాజీనే రాజమార్గమని దర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శివశంకరరెడ్డి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంపై ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కేసుల రాజీ కోసం ఈ నెల 29వ తేదీన లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సివిల్, క్రిమినల్ కేసులతో పాటు ఎలాంటి కేసులు అయినా పరిష్కరించుకోవచ్చన్నారు. అందు కోసం కక్షిదారులతో మాట్లాడి వారిని లోక్‌అదాలత్ పట్ల చైతన్య పరచాలన్నారు. సీనియర్ సివిల్ కోర్టు పరిధిలోని ఎలాంటి పెండింగ్ కేసులనైనా పరిష్కరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.

హిందూ ధర్మంపై ఆసక్తి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మంపై ఆసక్తి కలిగి ఉండాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గిద్దలూరు ఖండ కార్యవాహ్ పంటా శివ మల్లారెడ్డి అన్నారు. హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సాహితి కళాశాలలో బుధవారం విద్యార్థులకు నిర్వహించి అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందువుగా ఉన్న ప్రతి ఒక్కరూ గర్వంగా జీవించాలన్నారు. హిందూ ధర్మం జాగరణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మన ధర్మాన్ని రక్షించుకుంటూ ఎదుటి వారికి సేవ చేయాలనే ఆలోచనలో ప్రతి ఒక్కరం జీవితాన్ని గడపాలన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ సంఘ సేవకులు బీఎస్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



వద్దిమడుగులో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

కొనకనమిట్ల: గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టించి గొడవలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మాధవరావు హెచ్చరించారు. బుధవారం మండలంలోని వద్దిమడుగు, వాగుమడుగు గ్రామల్లో పర్యటించి శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కలిప్పించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సమన్వయం పాటించి ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. ఒకరికొకరు కలిసిమెలిసి ఉండాలని సూచించారు. అనంతరం కొనకనమిట్ల వద్ద జాతీయ రహదారిపై పలు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు.

కళ్యాణ వైభోగం

- శ్రీగిరి బ్రహ్మోత్సవాలలో అపూర్వ ఘట్టం
- అలరించిన స్వర్ణ సుబ్బారావు కోలాట బృందం ప్రదర్శన
- దేవేరులతో తిరువీధుల్లో మెరిసిన దేవదేవుడు



అమ్మవారి మంగళసూత్రంతో అర్చకులు

ఒంగోలు మెట్రో:

శ్రీదేవి భూదేవి సమేత శ్రీగిరి వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తులకు గొప్ప అనుభూతిని కలుగజేశాయి. బుధవారం ఉదయం శ్రీగిరి కళ్యాణ మండపంలో పరాంకుశం సీతా రామాచార్యులు బృందం ఆధ్వర్యంలో శ్రీవారి కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొని శ్రీవారి కళ్యాణాన్ని తిలకించి పులకించిపోయారు. సాయంత్రం శ్రీగిరి వెంకటేశ్వరస్వామికి తిరువీథోత్సవం నిర్వహించారు. ఉభయ దేవేరులతో శ్రీవారు తిరువీధుల్లో విహరించేందుకు రావడంతో మహిళలు శ్రీవారికి మంగళ హారతులిచ్చారు. ప్రముఖ కోలాట శిక్షకుడు స్వర్ణ సుబ్బారావు బృందం కోలాట విన్యాసాలతో భక్తులను అలరింపజేసింది. శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారితో పాటు ఆలూరు జైశంకర్, తదితరులు స్వర్ణ సుబ్బారావు కోలాట బృందం కళాకారులను ఘనంగా సన్మానించారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వామివారు, అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



కోలాట నృత్యం ప్రదర్శిస్తున్న మహిళా భక్తులు

మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ తొలగింపు ఆపాలి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మార్కాపురం: గత 25 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను తొలగించేందుకు రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఆ ఆలోచన వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం నాయకులతో కలిసి బుధవారం ఎంఈఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ.. ప్రభుత్వం మారగానే కొందరు వ్యక్తులు వచ్చి రాజీనామా చేయాలని లేదా మానుకోవాలని బెదిరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యార్థులకు సకాలంలో భోజనం పెడుతున్నారని, ప్రస్తుతం పనిచేస్తున్నవారినే కొనసాగించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు టి.గురునాధం, కొండమ్మ, మరియమ్మ, నాగిరెడ్డి, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి గురుపౌర్ణమి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

మార్కాపురం టౌన్: జూలై 21న గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న బాబా మందిరంలో ఈ నెల 27 నుంచి జూలై 22వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యదర్శి గోపాలుని హరిహరరావు బుధవారం తెలిపారు. గురుపౌర్ణమి సందర్భంగా ఓంసాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి.. నామ ఏకాహం, 28న మధ్యాహ్నం 3 గంటలకు బాబా జీవిత చరిత్రపై క్విజ్ కార్యక్రమం, 29న భక్తి గీతాల పాటల పోటీలు, 30వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు మార్కాపురం పట్టణంలో సాయి భిక్షాటన, జూలై 4న సాయిబాబా సర్వాంతర్యామి అనే అంశంపై ప్రవచనం, 5న సాయి సత్‌చరిత్ర, 6న సాయిబాబాలోని సుగుణ సంపద అంశంపై ప్రవచనాలు, 7న సాయి సచ్చరిత్రలోని కర్మసిద్ధాంతం, 8న సాయి సత్‌చరిత్ర 32వ అధ్యాయం, 9న సాయిబాబా చూపిన జ్ఞాన మార్గం, 10న సత్‌చరిత్రపై ప్రవచనాలు ఉంటాయని వివరించారు. జూలై 11 నుంచి 18వ తేదీ వరకు బాబా జీవిత చరిత్ర పారాయణం, జూలై 18వ తేదీ రాత్రి 7 గంటలకు సినీ భక్తి గీతాల పాటకచేరి, జూలై 19న శ్రీ లలిత సహస్ర నామ పారాయణం, రాత్రి ఏడు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 20న సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, గురు పౌర్ణమి రోజున ఉదయం 5.10 నిముషాలకు కాకడ హారతి, 6 గంటలకు పంచామృతాభిషేకం, 8 గంటలకు శ్రీశైలానికి చెందిన సాయిదాసు ఆధ్వర్యంలో సాయి సత్య వ్రతాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. జూలై 22న ఉదయం 8 గంటలకు పుర వీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నివారణకు చర్యలు

మద్దిపాడు: మద్దిపాడులోని ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు దోమలు కుట్టకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. దోమల నివారణకు పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్ ఆధ్వర్యంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు నేతృత్వంలో సూపర్‌వైజర్ బాలకోటయ్య డీడీటీ పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మలేరియా వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులకు తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి విష జ్వరాలపై అవగాహన కల్పించారు మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. దీని కోసం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వారి వెంట హాస్టల్ వార్డెన్లు సీహెచ్ రాఘవులు, కే రాము, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫైల్స్ పూర్తి చేయాలి

హనుమంతునిపాడు: ఎన్నికల సందర్భంగా ఆగిన వివిధ ఫైల్స్ పరిశీలించి పెండింగ్ లేకుండా పనులు పూర్తి చేయాలని తహసీల్దార్ కిషోర్‌రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీసేవా ద్వారా కానీ, సచివాలయాల నుంచి వచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఆన్‌లైన్లు, కుల ధ్రువీకరణ, ఆదాయం, ఫ్యామిలీ తదితర సర్టిఫికెట్లు పెండింగ్ ఉన్న వాటిని పరిశీలించి పూర్తి చేయాలన్నారు. గురువారం రెవెన్యూ డే సందర్భంగా అందరూ అందుబాటులో ఉండాలన్నారు. వీఆర్వోలు, వెంకట నర్సయ్య, పురుషోత్ బాదుర్ల, శ్రీనివాసులరెడ్డి, షేక్ రసూల్, సైదులు పాల్గొన్నారు.

21న మాలకొండ హుండీ లెక్కింపు

వలేటివారిపాలెం: మండలంలోని అయ్యవారిపల్లి పంచాయతీలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిదేవస్థానం12 వారాల హుండి లెక్కింపు ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కేబీ శ్రీనివాసరావు తెలిపారు. 21వ తేదీ ఉదయం 8.30 గంటలకు కొండ మీద ఉన్న కళ్యాణ మండపంలో 12 వారాల హుండి లెక్కింపు ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

సబ్జెక్ట్ టీచర్ల కొరత సమస్యను పరిష్కరించాలి



ముళ్లపాడులో ఉపాధ్యాయురాలికి సభ్యత్వ నమోదు పత్రం అందజేస్తున్న నేతలు

సీఎస్‌పురం(పామూరు): ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత సమస్యను తక్షణం పరిష్కరించాలని యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వెంకట్రావు, షేక్.పాదుషాలు అన్నారు. మండలంలోని ముళ్లపాడు, చింతలపాలెం, నల్లమడుగులతో పాటు పలు పాఠశాలల్లో బుధవారం యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విద్యాశాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్ విద్యారంగ సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అమ్మకు వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. పాఠశాల నిర్వహణ గ్రాంటును తక్షణం విడుదలచేయాలన్నారు. కార్యక్రమంలో పి.నాయబ్‌రసూల్, హెచ్.వీరాంజనేయులు, కె.నాగరాజు, పి.రవీంద్ర, యు.సాంబశివరావు, జి.నాగేంద్ర, యం.శ్రీనివాసులు, జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు అత్యధిక ధర కేజీ రూ.335

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం అత్యధిక ధర రూ.335 పలికింది. ఆలకూరపాడు, రావివారిపాలెం, అనంతవరం, పాలేటిపాడు, జయవరం గ్రామాల రైతులు 1032 బేళ్లను వేలానికి ఉంచగా 983 కొనుగోలయ్యాయి. 49 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.335, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.284.11 పలికింది.

ఎన్నాళ్లీ అవస్థలు



రోడ్డు మధ్యలో ఏర్పడిన లోతైన గుంత

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట డ్రైనేజీ నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి ఒంగోలు-నంద్యాల హైవే రోడ్డు వరకు నూతనంగా సీసీ రోడ్డు నిర్మించారు. ఎంపీడీఓ కార్యాలయం ముందు భాగంలో డ్రైనేజీ కాలువ నిర్మాణం కోసం కొంతమేర రోడ్డు నిర్మించకుండా వదిలిపెట్టారు. ఇక్కడ నీరు రోడ్డుపైకి పారుతుండటంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు మధ్యలో లోతైన గుంత ఉండటంతో పాటు మురికినీరు ప్రవహిస్తోంది. అధికారులు చర్యలు తీసుకుని చిన్నపాటి చప్టా నిర్మాణం చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

22న కుర్రా ప్రసాద్‌కు

తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కారం



కుర్రా ప్రసాద్‌బాబు

ఒంగోలు మెట్రో: జిల్లాలో శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షునిగా రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న కుర్రా ప్రసాద్‌బాబుకు తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కారం అందిస్తున్నట్లు పద్మశ్రీ ఘంటసాల కళాపరిషత్ అధ్యక్షుడు ఉప్పుతెర్ల కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఏడు గంటలకు స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ కళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న తులసి నోట తెలుగు పాట సంగీత విభావరి కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా ప్రసాద్‌బాబుకు పురస్కారం అందించి ఘనంగా సత్కరించనున్నట్లు చెప్పారు. ఈ పురస్కారానికి కుర్రా ఎంపికవడంపై నాగభైరవ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నవ్యాంధ్ర రచయితల సంఘ గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, కళామిత్ర మండలి జాతీయ లోగిలి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, సింహాద్రి జ్యోతిర్మయి, నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మిడసల మల్లికార్జున రావు, కనమాల రాఘవులు, జిల్లా రంగభూమి కళాకారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బేతంశెట్టి హరిబాబు, అంగలకుర్తి ప్రసాద్, అక్షర సాహితీ సమితి అధ్యక్షుడు ఎంవీఎస్ శాస్త్రి, లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, ఎస్వీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు గుంద్రెడ్డి బాలాజీ, మద్దులూరి వెంకట సుబ్బారావు, డాక్టర్ ఎల్వీఎన్ ప్రసన్నకుమార్, అనుమల మహేంద్ర కుమార్, బొమ్మరాజు మారుతీ భాస్కరశర్మ, తదితరులు అభినందనలు తెలిపారు.

చిన్నారులకు బడి బాట



చిన్నారులను పాఠశాలలో చేర్పిస్తున్న అంగన్‌వాడీలు



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు

ఒంగోలు సెంట్రల్: కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ అనూరాధ మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలలో పూర్వప్రాథమిక విద్యను ఆట, పాట ద్వారా నేర్పుతున్నట్లు తెలిపారు. తద్వారా చిన్నారులు మంచి ఆసక్తితో చదువు నేర్చుకుంటున్నట్లు చెప్పారు. చదువుతో పాటు వారికి చిన్నతనంలోనే పౌష్టికాహారం అందించడంతో ఆరోగ్యంగా ఉండటానికి ఎంతో సహకరిస్తుందన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాలను గమనించి అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపాలని కోరారు. అనంతరం పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న వారికి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. 15 మందిని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు సెక్టార్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల జాయినింగ్ సంఖ్య పెంచాలని సూచించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శ్రీదేవి, ఉపాధ్యాయురాలు రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు సీజ్ చేస్తాం



బస్సు రికార్డులు పరిశీలిస్తున్న ఎంవీఐ మాధవరావు

మార్కాపురం: మార్కాపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ పరిధిలో ఉన్న స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ లేకుంటే సీజ్ చేస్తామని ఎంవీఐ మాధవరావు హెచ్చరించారు. బుధవారం ఆయన పట్టణంలోని వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన పది బస్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్సులకు లైసెన్సు, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్సు, పొల్యూషన్ సర్టిఫికెట్ తదితర రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. స్కూల్ బస్‌ల మెయింటెన్స్ సక్రమంగా ఉండాలని, రోజూ బస్సుల బ్రేక్‌ను డ్రైవర్లు చెక్ చేసుకోవాలని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా యాక్సిడెంట్లు జరిగి పిల్లల జీవితాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, విద్యార్థులను పాఠశాల నుంచి ఇంటికి, ఇంటి నుంచి పాఠశాలకు తీసుకెళ్లే సమయంలో ముందు వెళ్తున్న వాహనాలను ఓవర్‌టేక్ చేయవద్దని చెప్పారు. బస్సుల నుంచి విద్యార్థులను కిందకు దించేటప్పుడు, ఎక్కించేటప్పుడు క్లీనర్లు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఎమ్మెల్యే కోసం విద్యార్థుల ఎదురుచూపులు

గిద్దలూరు రూరల్: స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఎప్పుడు తమ పాఠశాలకు వచ్చి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తారని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో పాఠశాలలు ఈ నెల 13వ తేదీ నుంచి ప్రారంభించారు. దాదాపు అన్ని చోట్లా పుస్తకాల పంపిణీ దాదాపు పూర్తి చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఒక్క గిద్దలూరు మండలం తప్ప 5 మండలాల్లో పంపిణీ చేశారు. జూన్ 1వ తేదీ పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు వచ్చాయి. మండల విద్యాశాఖ అధికారుల అత్యుత్సాహం ఎమ్మెల్యే వద్ద తమ ప్రాబల్యం పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో పాఠ్యపుస్తకాలను ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీ చేయించాలని పుస్తకాల పంపిణీ చేయించకుండా అలాగే నిలిపివేశారు. దీంతో పాఠ్యపుస్తకాలు అందక విద్యార్థులు ఎమ్మెల్యే ఎప్పుడు వస్తాడా.. ఎప్పుడు తమ చేతికి పుస్తకాలు అందుతాయా అని ఎదురుచూస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కందుకూరు: పట్టణంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, అక్రమ లేఅవుట్‌లపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలను వెంటనే గుర్తించి వాటికి నోటీసులు జారీ చేయాలని, అనుమతులు ఉల్లంఘన జరగకుండా వెంటనే సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. తాత్కాలిక ఆక్రమణ పన్ను వసూలులో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆక్రమణదారులను గుర్తించి ఆక్రమణ విధించాలని, సంబంధిత వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు విధిగా ఉదయం 8 గంటల కల్లా వారి పరిధిలోని అనధికారిక లేఅవుట్లు, నిర్మాణాలు గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కట్టడాలకు సంబంధించి ఎటువంటి డీవియేషన్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం పనిచేయని సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.